సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



అప్పు వసూలయ్యేదెట్లా?

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. మూడు నియోజవర్గాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 8లో▸

న్యూస్‌రీల్

అంతర్జాతీయ సదస్సుకు రవీందర్‌రెడ్డి



షాద్‌నగర్: న్యూఢిల్లీలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడికి సామ రవీందర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ అనుబంధ శివాజీ కొలాబరేషన్, క్లైక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జనపథ్ రోడ్‌లో అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ రిసర్జెంట్ భారత్ ఆన్ గ్లోబల్ కాన్వాస్ అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే సదస్సుకు ఫౌండేషన్ నిర్వాహకులు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందరెడ్డికి శనివారం ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... అంతర్జాతీయ సదస్సులో దేశంలో అమల్లోకి వస్తున్న నూతన విద్యావిధానం పై ఇంప్లిమెంటింగ్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ, గవర్నెన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశం పై పరిశోధనా పత్రాన్ని సమర్పించబోతున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ సదస్సుకు హాజరయ్యేందుకు తన పరిశోధన పత్రం ఎంపికవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డిని పాలమూరు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, కళాశాల ప్రిన్సిపాల్ కమల అభినందించారు.

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా చంద్రశేఖర్



సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌గా ఉన్న ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు.

మహిళా సాధికారతకు కృషి

ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్



అభివృద్ధి పనుల కోసం స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న దాన కిషోర్

కొడంగల్ రూరల్: మహిళా సాధికారతకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ అన్నారు. శనివారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో నియోజకవర్గంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులపై వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్లు రాహుల్‌శర్మ, మహంక్ మిట్టల్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. ఏయే పనులు చేపట్టాల్సి ఉందని దాన కిషోర్ అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఆయన మాట్లాడారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి, జీవనోపాధికి ఉపయోగపడేలా నైపుణ్య అభివృద్ధి యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు అభివృద్ధి పథంలో నిలవాలని సూచించారు. సంఘాల ద్వారా మహిళలు సభ్యులుగా చేరి ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. మహిళలు ఉన్నత చదువులు చదువుకుంటే వారి పిల్లలు ఉన్నత స్థానాల్లో నిలిచే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలను చదివిస్తూ వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలో చేపడుతున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులు, మార్కెట్ యార్డు తోపాటు వివిధ అభివృద్ధి పనులను, అవసరమైన స్థలాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ వెంకటేశ్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

20న తాండూరుకు కేంద్ర మంత్రి

తాండూరు టౌన్: ఈ నెల 20న తాండూరులో బీజేపీ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న రాజరాజేశ్వరి బస్సు యాత్ర కార్యక్రమానికి కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా హాజరు కానున్నట్లు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టిప్పన్లు మాయం!

- 1,67,550 సర్వే నంబర్లకుగాను 1,12,858 మాత్రమే రికార్డులు
- 54,692 సర్వే నంబర్లకు గల్లంతు
- 601 రెవెన్యూ గ్రామాలకు.. 575 పంచాయతీలకే మ్యాప్‌లు
- 27 మండలాలకు 14 మందే సర్వేయర్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూముల వివాదాల పరిష్కారంలోనే కాదు వాటి స్వరూపం, మొత్తం విస్తీర్ణం, హద్దులను నిర్ణయించడంలో పహాణీలు, పాసు పుస్తకాలతో పాటు విలేజీ మ్యాప్‌లు, సర్వే నంబర్ల వారీగా ఏర్పాటు చేసిన టిప్పన్లు(సర్వే నంబర్‌లో కొలత రికార్డు (పేపరు)) కీలక పాత్ర వహిస్తాయి. వీటిని పరిరక్షించడంలో రెవెన్యూ, డిస్ట్రిక్స్ సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఫలితంగా కీలకమైన భూములకు సంబంధించిన టిప్పన్లు మాయమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 1,67,550 సర్వే నంబర్లు ఉండగా, వీటిలో 1,12,858 సర్వే నంబర్లకు మాత్రమే టిప్పన్లు అందుబాటులో ఉన్నాయి. మరో 54,692 సర్వే నంబర్లకు టిప్పన్లు గల్లంతయ్యాయి. వీటిలో మెజార్టీ ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, భూదాన్ భూములకు సంబంధిన భూములవే ఉండటం గమనార్హం. ఇప్పటికే ఈ భూములు కబ్జా చేసిన రియల్టర్లు, అధికారులతో కుమ్మక్కై... ఓ ప్రణాళిక ప్రకారమే వాటిని మాయం చేశారనే ఆరోపణలు లేకపోలేదు. 372 సేత్‌వార్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సరిహద్దు వివాదాలు, విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులు వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. వీటి పరిష్కారం కోసం ఆ భూములను రీ సర్వేలు చేయాల్సిన దుస్థితి తలెత్తుతుంది.

గ్రామాల మ్యాప్‌లు గల్లంతు

జిల్లా వ్యాప్తంగా 601 రెవెన్యూ గ్రామాలుండగా.. వీటిలో 575 గ్రామాలకు మాత్రమే విలేజీ మ్యాప్‌లున్నాయి. మరో 26 రెవెన్యూ గ్రామాలకు విలేజీ మ్యాప్‌లు లేవు. దీంతో గ్రామ సరిహద్దుల గుర్తింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా చెరువులు, కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, వాటిలోని భూవిస్తీర్ణం గుర్తింపులోనూ సమస్యలు తలెత్తుతున్నాయి. అందుబాటులో ఉన్న గ్రామాల్లో పంచాయతీ భవనంపై మ్యాప్‌ను వేసి, సర్వేనంబర్లు, చెరువులు, కుంటలు, దేవాలయాల వివరాలను నమోదు చేసి ఉంచుతున్నారు. ఫలితంగా గ్రామంలో ఏదీ ఎక్కడ ఉందో గుర్తించడం సులభమవుతోంది.

1,685 దరఖాస్తులు పెండింగ్

భూముల పంపకాల విషయంలో అన్నదమ్ములు, ఇతర దాయాదుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. సరిహద్దుల పక్కా నిర్ధారణ, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు వంటి సమస్యల పరిష్కారం కోసం ఆయా బాధితులు ప్రభుత్వ సర్వేయర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికే కోర్టు కేసులు, ఇతర వివాదాల్లో ఉన్న భూముల తీర్పులకు ఈ సర్వేయర్లు ఇచ్చే కొలతలే కీలకంగా మారుతున్నాయి. భూముల సర్వే కోసం జిల్లాలో ఇప్పటి వరకు 1,900 మందికిపైగా రైతులు, బాధితులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 285 దరఖాస్తులే పరిష్కరించారు. మరో 1,685 దరఖాస్తులు పెండింగ్ లోనే ఉన్నాయి. జిల్లాలో 27 మండలాలుండగా, కేవలం 14 మంది సర్వేయర్లే అందుబాటులో ఉన్నారు. ఈ సర్వేయర్ల కొరత వల్ల దరఖాస్తు చేసి మూడు నెలలు గడిచినా.. ప్రక్రియ పూర్తికానీ దుస్థితి. బాధితుల్లో ఉన్న బలహీనతను అవకాశంగా తీసుకుంటున్న పలువురు సర్వేయర్లు ముందు ముడుపులు ముట్టజెప్పుతారో? వారి భూములనే సర్వే చేస్తున్నారు. మిగిలిన వారి భూ సర్వేలను దాట వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

రెండేళ్లు దాటింది



నాకు 18 ఎకరాల భూమి ఉంది. 13 గుంటలు తక్కువ వస్తుంది. మీ సేవలో దరఖాస్తు చేసి రేండేళ్లు దాటింది. ఇప్పటికీ సర్వేయర్ రాలేదు. తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ తిరిగి చెప్పులరిగి పోయాయే కానీ సమస్య పరిష్కారం కాలేదు. వారం రోజుల క్రితం మళ్లీ మీ సేవకు వెళ్లాను, ఫీజు కట్టి, దరఖాస్తు చేశాను. అయినా వస్తారో? లేదో వేచి చూడాల్సిందే.

– కురువ మల్లేశ్, చౌదరిగూడ

సర్వేయర్ల కొరత



జిల్లాలో సర్వేయర్ల కొరత ఉన్న విషయం నిజమే. ఒక్కో సర్వేయర్‌కు రెండు మండలాలు అప్పగించి, వచ్చిన దరఖాస్తులను సీనియార్టీ ప్రకారం పరిష్కరిస్తున్నాం. భూములకు సంబంధించిన అన్ని రికార్డులను భద్రపరుస్తున్నాం. అయితే కొన్ని సర్వే నంబర్లకు చెందిన టిప్పన్లు లేక పోవడం వాస్తవమే. అలాంటి చోట రీ సర్వే చేస్తున్నాం.

– శ్రీనివాసులు, ఏడీ, లాండ్స్ సర్వే విభాగం

'ఇంటింటికి వంద.. బడికి చందా' బాగుంది

- గ్రామాభివృద్ధికి చేసిన కృషి అభినందనీయం
- కలెక్టర్ శశాంక



కలెక్టర్ శశాంకకు జ్ఞాపిక అందజేస్తున్న మజీద్‌పూర్ వాసులు

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి గత పాలకవర్గం, గ్రామ ప్రజలు చేసిన కృషి అభినందనీయమని కలెక్టర్ శశాంక ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం 'ఇంటికి వంద.. బడికి చందా' అనే కార్యక్రమంతో ప్రజలందరిని భాగస్వాములను చేసి పాఠశాల నిర్మాణం కోసం నిధి తయారు చేయడం ఆలోచన బాగుందని కితాబిచ్చారు. శనివారం మజీద్‌పూర్ మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి కలెక్టర్ శశాంకను కలిశారు. పదిహేను నిమిషాల పాటు గ్రామం, పాఠశాల అభివృద్ధి గురించి కలెక్టర్‌కు వివరించారు. దాతల సహకారంతో రూ.15 లక్షలు నిధి సేకరించామని కలెక్టర్‌కు చెప్పారు. పాఠశాలకు సీఎస్ఆర్ నిధుల ద్వారా సహాయం అందిస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వందేమాతరం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవీంద్రచారి, మాజీ వార్డు సభ్యులు గణేశ్, చైతన్యరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు వెంకటేశ్, కృష్ణ, సుదర్శన్ ఉన్నారు.

శభాష్.. పోలీస్

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ

ఇబ్రహీంపట్నం: బలవన్మరణానికి పాల్పడిన ఓ వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు ఓ ఎస్ఐ. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం ఎస్ఐ మైబెల్లి తన సిబ్బందితో రాయపోల్ దారిలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అదే రూట్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తి చెట్టుకు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందింది. హుటాహుటిన అక్కడికి వెళ్లిన ఎస్ఐ ఉరేసుకున్న వ్యక్తి నాడిని పరిశీలించారు. పల్స్ తగ్గడంతో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. బాధితుడిని పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సంతోశ్ ముఖర్జీ(29)గా గుర్తించారు. కుటుంబ వివాదాల నేపథ్యంలో ముఖర్జీ బలవన్మరణం చేసుకునేందుకు యత్నించినట్లు ఎస్ఐ మైబెల్లి తెలిపారు. పలువురు ఆయనను అభినందించారు.



సంతోశ్ ముఖర్జీకి సీపీఆర్ చేస్తున్న ఎస్ఐ మైబెల్లి

కులగణన!

- ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించిన అసెంబ్లీ
- విధి విధానాలు రూపొందిస్తున్న యంత్రాంగం
- 2011 లెక్కలతో పోలిస్తే భారీగా పెరిగిన జనాభా



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కుల గణనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టింది. విధి విధానాలు రూపొందించి, త్వరలోనే ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 24,46,265 జనాభా ఉన్నట్లు తేలింది. వీరిలో 3,37,023 మంది ఎస్సీలు, 1,38,710 మంది ఎస్టీలు ఉన్నట్లు గుర్తించింది. ప్రస్తుతం వీరి సంఖ్య రెట్టింపైంది. వీరితో పాటు బీసీల జనాభా సైతం ఘణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో కులాల వారీగా జనాభా లెక్కలు తీయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా ఏళ్ల తరబడి ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కులాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు వచ్చే ఎన్నికల్లో జనాభా ప్రతిపాదికన వార్డులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా అవకాశం కల్పించాలని భావిస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కులగణన చేపట్టిన తర్వాత వాటికి చట్టబద్ధత కల్పించాలని బీసీ కులాల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది.

363 వార్డుల్లో సమాచారం

జిల్లాలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా.. వీటి పరిధిలో 363 వార్డులు ఉన్నాయి. వీటిలో 1,95,199 నివాసాలు ఉండగా, ఇక్కడ మొత్తం 5,36,123 మంది ఉన్నారు. వీరిలో ఎస్సీలు 78,430 మంది ఉండగా, ఎస్టీలు 43,599 మంది ఉన్నారు.

45 లక్షలు దాటినట్లు అంచనా

ప్రతీ పదకొండేళ్లకోసారి జనాభాను లెక్కించాల్సి ఉంది. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్ర కుటుంబ సర్వే పేరుతో వివరాలు సేకరించింది. కానీ వాటికి చట్టబద్ధత కల్పించలేదు. 2021లో జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా, పలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తుంది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణనకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకు కనీస గుర్తింపునకు నోచుకోలేక పోయిన బీసీ కులాలకు ఉపశమనం లభించింది. గతంతో పోలిస్తే జిల్లా జనాభా రెట్టింపైంది.

డివిజన్ల వారీగా షెడ్యూలు కులాలు, తెగల వివరాలు

డివిజన్	ఎస్సీలు	ఎస్టీలు
చేవెళ్ల	52,317	4,483
ఇబ్రహీంపట్నం	76,112	32,526
కందుకూరు	92,467	58,929
రాజేంద్రనగర్	67,952	16,852
షాద్‌నగర్	48,175	25,946

2011 లెక్కల ప్రకారం వివరాలు

జిల్లా స్వరూపం	5,030 స్క్వేర్ కిలోమీటర్లు
మొత్తం జనాభా	24,46,265
పురుషులు	12,54,184
మహిళలు	11,92,081
గ్రామీణ జనాభా	10,26,113
పట్టణ జనాభా	14,20,152
లింగ నిష్పత్తి	1000:950
మొత్తం గృహాలు	5,63,565
ఎస్సీలు	3,37,023
ఎస్టీలు	1,38,710
0–6 ఏళ్లలోపు పిల్లలు	3,00,511
0–6 ఏళ్లలోపు లింగ నిష్పత్తి	925

ప్రస్తుతం జిల్లాలో 18 ఏళ్లు దాటిన ఓటర్లు 35,91,987 మంది ఉన్నారు. ఆలోపు వయస్సున్న వారు మరో పది లక్షల వరకు ఉన్నట్లు అంచనా. పక్కాగా కులగణన చేపడితే.. గ్రామాలు, వార్డుల వారీగా ఏ కులానికి చెందిన ప్రజలు ఎంత మంది ఉన్నారనే అంశం స్పష్టమవుతుంది. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థులకు టికెట్లు ఇవ్వనున్నాయి. అణగారిన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం లభించనుంది.అంతేకాదు ప్రభుత్వం ఏటా ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనూ కేటాయింపులు పెరిగే అవకాశం ఉంటుంది. మెజార్టీ ప్రజలకు ఆర్థిక సాయం అందనుంది.



మాట్లాడుతున్న సపాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశం

జీవన ప్రమాణాలు పెంచండి

సపాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశం


సాక్షి, రంగారెడ్డిజిల్లా: సపాయి కర్మచారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సక్రమంగా అమలు చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సపాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ ఎమ్.వెంకటేశం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో సపాయి కర్మచారుల కోసం జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న పథకాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జాతీయ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. సపాయి కర్మచారులకు పునరావాసం కల్పించడంలో ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సపాయి కర్మచారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్లలో, మున్సిపాలిటీలలో పని చేస్తున్న సపాయి కర్మచారులకు పేస్లిప్స్, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్లు తెలిపారు. సపాయి కర్మచారులు నివసించే ప్రాంతాల్లో ఏడాదికి రెండుసార్లు తప్పక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి కల్పనలో ప్రత్యేక చొరవ తీసుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్లలో కర్మచారులను నియమించి వీరికి ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను అందించాలని ఆదేశించారు. మహిళా కార్మికులకు ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రధానమంత్రి బీమా యోజన స్కీమ్ పై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సైబరాబాద్ డీసీపీ(క్రైమ్) నర్సింలు, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామారావు, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి నవీన్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, సఫాయి కర్మచారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం.. పురుగుల అన్నం!

ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యానికి బదులుగా నాసిరకం, నాణ్యత లేని బియ్యం సరఫరా అవుతున్నాయి. తుట్టెలు కట్టిన బియ్యంతో వంట చేయడంతో దుర్వాసన వస్తోంది. పురుగులు రావడంతో విద్యార్థులు తినలేక పోతున్నారు.

పట్టించుకోని వంట సిబ్బంది, ఉపాధ్యాయులు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పీటీఎంలో నిలదీసిన తల్లిదండ్రులు



తుట్టెలు కట్టిన బియ్యాన్ని చూపుతున్న తల్లిదండ్రులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం తీసుకువచ్చింది. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ పథకం పురుగుల అన్నంతో కొనసాగుతోంది. విషయం తెలుసుకున్న తల్లితండ్రులు పేరెంట్స్ టీచర్ మీటింగ్(పీటీఎం)లో ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన సిబ్బందిని నిలదీశారు. ఈ ఘటన శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది.

ఐదు రోజులుగా అదే వడ్డన

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐదు రోజులుగా పురుగులు పట్టిన బియ్యంతో సిబ్బంది మధ్యాహ్న భోజనాన్ని వండుతున్నారు. పాఠశాలలో ఉన్న కొద్దిపాటి బియ్యం నిండుకోవడంతో సమీపంలోని రాయికల్ పాఠశాల నుంచి బియ్యం తీసుకువచ్చారు. వచ్చిన బియ్యం తెట్టెలతో పాటు పురుగులున్నాయి. సిబ్బంది సైతం అలాగే వంట చేస్తున్నారు. దీంతో ఆ భోజనం తీసుకునేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


పురుగుల అన్నం...తినలేకపోతున్నాం...

మూడు రోజులుగా పాఠశాలలోపురుగులు పట్టిన బియ్యంతో అన్నం వండుతున్నారు.పురుగుల అన్నం తినలేక, కడుపు మాడ్చుకోలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.కొందరువిద్యార్థులు తమ ఇంటికెళ్లి మధ్యాహ్న భోజనం చేసి వస్తున్నారు. మరికొందరు ఇంటికి వెళ్లలేక, పాఠశాలలో వండిన అన్నం తినలేక తమ కడుపులను మాడ్చుకుంటున్నారు.అర్థాకలితో తమ చదువులను కొనసాగిస్తున్నారు.మధ్యాహ్న భోజనాన్నితినలేకపోతున్నామని తమ తల్లితండ్రులతో మొరపెట్టుకున్నారు.

పీటీఎంలో తల్లిదండ్రుల నిలదీత

విఠ్యాల జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు రవి అధ్యక్షతన పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, సిబ్బందిని నిలదీశారు. బియ్యం పరిశీలించి పిల్లల ఆరోగ్యంతో ఆటాలడుతున్నారంటూ కోపోద్రిక్తులయ్యారు. ఉన్నతాధికారులు స్పందించిక వెంటనే నాణ్యమైన బియ్యం సరఫరా చేసి విద్యార్థులకు మంచి భోజనం వడ్డించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తినలేకపోతున్నారు



పాఠశాలలో పురుగు పట్టిన బియ్యంతో మధ్యాహ్న భోజనం వండుతున్నారు.పిల్లలు తినలేకపోతున్నారు.మధ్యాహ్నం ఇంటికి వచ్చిన భోజనం చేస్తున్నారు.పురుగుల అన్నంతినడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతారు.ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి

– భారతమ్మ, విద్యార్థి నానామ్మ, విఠ్యాల

చర్యలు తీసుకోవాలి



మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలి. అర్థాకలితో చదువు కొనసాగిస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పదించి చర్యలు తీసుకోవాలి. పురుగుపట్టిన బియ్యం వండడం సరికాదు.

– గోనెల రాజు, విద్యార్థి తండ్రి, విఠ్యాల

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


వజీర్(ఫైల్)

నందిగామ: చంద్రాయన్‌గూడ సమీపంలో పాత జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. షాద్‌నగర్‌కు చెందిన వజీర్ రెండు రోజుల క్రితం హైదరాబాద్ వైపునకు కారులో అతివేగంగా ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి బోల్తాపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నగరంలోని ఓ ఆసుపత్రిలో వజీర్ చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచాడు.

కారు, స్కూటీ ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

మహేశ్వరం: కారు, స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మహేశ్వరం గేటు మధ్యన ప్రజయ్ వర్జీన్ విల్లాస్ రోడ్డు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కందుకూరు మండలం పులిమామిడి గ్రామానికి చెందిన వత్తుల నర్సింహ, ఉప్పర్‌పల్లికి చెందిన అంజయ్యలు స్కూటీపై మంఖాల్‌లోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల గ్రామానికి చెందిన బోధ యాదగిరి రెడ్డి మహేశ్వరం నుంచి పార్చునర్ కారులో వస్తుండగా.. రెండు వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న వత్తుల నర్సింహ, అంజయ్యలకు తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ రవీందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చరిత్రాత్మకం.. కులగణన తీర్మానం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: కులగణన తీర్మానం చారిత్రాత్మక నిర్ణయం అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీన వర్గాలను బలోపేతం చేయడం, పాలితులను పాలకులుగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అందుకు రాష్ట్రంలోని ప్రజల వాస్తవ స్థితిగతుల వివరాలను శాస్త్రీయంగా సేకరించేందుకు కులగణన తీర్మానాన్ని ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే చెప్పారు. ఇది ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జరిగిందని తెలిపారు. ఈ తీర్మానాన్ని అన్ని పార్టీలు ఏకగ్రీవం తెలపడం హర్షణీయమన్నారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనాలు కల్పించడం సహా.. అన్ని విధాలుగా బలహీనవర్గాలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుదన్నారు. రాష్ట్రంలో బీసీ వర్గాలకు ఇది వరంగా మారుతుందని, తీర్మానం ఆమోదం పొందిన రోజు చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తుందని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. పదవ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు బాబర్‌ఖాన్, అందె మోహన్, సీతారాం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో మెరిసిన 'మోడల్' విద్యార్థినులు


జేఈఈ మెయిన్స్‌కు ఎంపికైన రాధిక


ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన రుచిత

షాబాద్: జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్స్ పరీక్షల్లో షాబాద్ మోడల్ పాఠశాల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.రాధిక(ఎంపీసీ) ఉత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వాచ్య తెలిపారు. జనవరిలో దేశవ్యాప్తంగా జరిగిన జేఈఈ మెయిన్స్ సెషన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, మే నెలలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 9వ తరగతి చదువుతున్న కె.రుచిత ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. సైన్స్ ప్రాజెక్టులో సృజనాత్మకంగా ఆలోచించి, ఇంటి నిర్మాణంలో ప్లాస్టిక్‌ను ఏ విధంగా వాడాలని, ఉపాధ్యాయులు రాఘవేందర్, వెంకటేశ్వర్లు సహాయంతో ప్రదర్శించినందుకు ఈ అవార్డు పొందినట్లు తెలిపారు. పీఎం స్కీం కింద ఎంపిక కావడంతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఉచిత కరాటే తరగతులు 6,10వ తరగతి వరకు నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తలకొండపల్లి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో వెలుగు చూసింది. ఎస్‌ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన రవి(30) ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కానీ ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఆందోళన కుటుంబ సభ్యులు.. తెలిసిన వారందరినీ విచారించారు. కానీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రవి అన్న కుమార్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పు వసూలయ్యేదెట్లా?

- రుణం చెల్లించని ఫార్మాసిటీ భూ బాధిత రైతులు
- పీఏసీఎస్‌లో రూ.4కోట్లకు పెరిగిన రుణాలు
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- భూములు ఇప్పిస్తే.. డబ్బు చెల్లిస్తామంటూ కర్షకుల మెలిక

ఫార్మాసిటీ భూ బాధితుల నుంచి రుణాల వసూలు పీఏసీఎస్ అధికారులకు తలనొప్పిగా మారింది. బకాయిలు చెల్లించాలని రైతుల ఇళ్ల చుట్టూ తిరిగినా స్పందన లేదు. నోటీసులు జారీ చేస్తే.. మా భూములు మాకు ఇప్పించండి. మీ బకాయి చెల్లిస్తామంటూ కర్షకులు మొండికేయడం గమనార్హం.


నక్కర్తమేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీకి సేకరించిన రైతుల భూములు ఇవే

యాచారం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధి 19,333 ఎకరాల్లో టీఎస్‌ఐఐసీ ఫార్మాసిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 2017 నుంచి యాచారం మండల పరిధి నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని అసైన్డ్, పట్టా భూములను సేకరించడం ప్రారంభించింది. దీనికి ముందే పై గ్రామాలకు చెందిన 120 మంది రైతులు, దాదాపు 250 ఎకరాలకు పైగా భూమికి సంబంధించి 2007 నుంచి 2016 వరకు యాచారం పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లో రూ.2.5 కోట్లకు పైగా దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు పొందారు.

రూ.4 కోట్లకు పెరిగిన అప్పులు

పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న రుణాలు.. యేటేటా వడ్డీ, చక్రవడ్డీతో కలిపి ప్రస్తుతం రూ.4 కోట్లకు పెరిగింది. భూసేకరణ సమయంలోనే సంఘం అధికారులు, రెవెన్యూ అధికారులకు రుణాలు తీసుకున్న రైతుల పేర్లతో కూడిన జాబితాను అందజేశారు. ఆ రైతుల భూములను ఫార్మాసిటీకి తీసుకుంటే తమకు సమాచారం ఇవ్వాలని, లేదంటే అప్పు బకాయిలు చెల్లించి, మిగితా డబ్బులు వారికి ఇవ్వాలని కోరారు. అయినా రెవెన్యూ అధికారుల నుంచి స్పందన లేదు. ఫార్మాసిటీకి మొదట్లో భూములు ఇచ్చే విషయంలో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అప్పట్లో అప్పు బకాయిలు దేవుడెరుగు, ముందు ఫార్మాసిటీకి భూసేకరణ జరగాలని టీఎస్‌ఐఐసీ, రెవెన్యూ అధికారులు పట్టుదలతో ఉన్నారు. ఆ సమయంలో పీఏసీఎస్ అధికారుల మాటను పట్టించుకోకుండానే రెవెన్యూ, టీఎస్‌ఐఐసీ అధికారులు ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు పరిహారం చెక్కులను అందజేశారు. పరిహారం పొందిన రైతులు నేరుగా.. ఇతర బ్యాంకు ఖాతాల్లో వారి చెక్కులను జమ చేసి డబ్బులు తీసుకున్నారు.

భూములే ఇచ్చాం.. అప్పు ఎక్కడిది?

మండల పరిధి గ్రామాల రైతుల నుంచి సుమారు 7 వేల ఎకరాలకు పైగా పట్టా, అసైన్డ్ భూములను ఫార్మాసిటీకి కట్టబెట్టారు. సేకరించిన భూమికి ఎకరాకు రూ.8 లక్షలు, పట్టా భూమి ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. ఆ భూములు పూర్తిగా సారవంతమైనవి, మెట్ట పంటలతో పాటు వరి, కూరగాయలు, పండ్లతోటలు పండే సాగు నేలలు. భూములను కోల్పోయి పరిహారం పొందిన రైతులు.. కొందరు దూర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను కొనుగోలు చేయగా, ఇంకొందరు ఇతర అవసరాలకు వాడుకున్నారు. అంత వరకు బాగానే ఉన్నా.. ఫార్మాకు భూములు ఇచ్చిన రైతులు నేడు బతుకు దెరువు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి.. పీఏసీఎస్ అధికారుల నుంచి రుణం చెల్లించాలని నోటీసులు జారీ చేసినా.. స్పందన లేదు. గట్టిగా అడిగేసరికి 'భూములు ఇచ్చి నష్టపోయాం.. ఇక అప్పులు ఎలా చెల్లించేది? మా భూములు మాకు ఇప్పించండి. మీ బకాయిలు పూర్తిగా చెల్లిస్తాం' అని రైతులు మొండికేస్తున్నట్లు సమాచారం. దీంతో పీఏసీఎస్ అధికారులు తలలు పట్టుకున్నారు.

"నోటీసులు పంపుతున్నాం



రుణాలు పొందిన రైతుల జాబితాను.. భూసేకరణ సమయంలో కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచారం తహసీల్దార్‌కు అందజేశాం. అయినా తమకు సమాచారం ఇవ్వకుండానే.. ఆ రైతులకు పరిహారం చెక్కులను ఇచ్చేశారు. వాటిని బ్యాంకుల్లో వేసుకొని రైతులు డబ్బులు తీసుకున్నారు. కానీ.. తీసుకున్న అప్పు చెల్లించడం లేదు. మూడేళ్లుగా.. నోటీసులు పంపిస్తున్నా స్పందన లేదు. గట్టిగా అడిగితే.. మా భూములు ఇప్పించండి, మీ బకాయిలు చెల్లిస్తామంటున్నారు.

– నాగరాజు, సీఈఓ, యాచారం పీఏసీఎస్

ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న జూదరులను ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేసి, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఇద్దరు యువకులు ఆన్‌లైన్ ద్వారా హార్స్ రైడింగ్ గేమ్ ఆడుతూ, బెట్టింగ్ కడుతున్నారనే సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసుల ఆధ్వర్యంలో సంయుక్త దాడులు నిర్వహించారు. ఇందులో చారకొండ, నాగర్‌కర్నూల్‌కు చెందిన బడిగ రామకృష్ణ, తిరుమల కాలనీ రాగన్నగూడకు చెందిన అల్వాల కమలాకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.60 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు. జూదరులు బెట్టింగ్‌కు ఉపయోగిస్తున్న బ్యాంకు ఖాతాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు.